సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 23 । మే । 2023



సరదాల వేళ.. మృత్యు పరదా

ఆ ముగ్గురూ బంధువులే.. వీరిలో ఒకరి పెళ్లి రోజు.. అందరూ కలిసి కారులో యానాం పార్టీకి వెళ్లి తిరిగి వస్తూ మృత్యువాత పడ్డారు. - 8లో▸



స్వల్పంగా పెరిగిన ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 12,389 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి ఉధృతి స్వల్పంగా పెరిగింది.

గరిష్టం/కనిష్టం

41.5° / 26.4°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.5	26.5
కాకినాడ	37.2	26.4
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

స్పందనకు 195 అర్జీలు



చిరుధాన్యాల ఫుడ్ బాస్కెట్లను కలెక్టర్‌కు అందిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 195 అర్జీలు అందాయి. ప్రజల నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థ ప్రతినిధులు చిరుధాన్యాలతో రూపొందించిన ఫుడ్ బాస్కెట్‌ను కలెక్టర్‌కు అందజేశారు. స్పందనలో పాల్గొన్న అధికారులందరికీ రాగి జావ, చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించారు. ఇది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరమని కలెక్టర్ అన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. తొలుత అమలాపురం మండలం సాకుర్రు గ్రామానికి చెందిన వికలాంగుడు తాడికొండ సత్యనారాయణమూర్తికి కలెక్టర్ శుక్లా ట్రై సైకిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 24 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయి. వీటిలో అధికంగా కుటుంబ తగదాలు, ఆస్తి వివాదాలు ఉన్నాయి. వివిధ సమస్యలపై ఎస్పీ వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, ఎస్సై జి.రామకృష్ణ కూడా పాల్గొన్నారు.

‘ఓపెన్’ ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత

- ఎస్ఎస్‌సీలో జిల్లా ఐదో స్థానం
- ఇంటర్‌లో తృతీయం

రాయవరం: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. గత నెల 3 నుంచి 15వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ఐదు, ఇంటర్‌లో మూడు స్థానాల్లో నిలిచింది. ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1,132 మంది హాజరయ్యారు. వీరిలో 886 మంది ఉత్తీర్ణత (78.27 శాతం) సాధించారు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 4,304 మంది హాజరు కాగా, 3,631 మంది 84.36 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది మాదిరిగానే ఓపెన్ స్కూల్ ఫలితాలు వచ్చాయి. జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించడంపై జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు.

ద్రాక్షారామలో సప్త గోదావరి ఆధునీకరణకు శ్రీకారం



సప్త గోదావరి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. దీనికోసం రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో ప్రభుత్వం దేవదాయ శాఖ నుంచి రూ.కోటి కామన్ గుడ్ ఫండ్ నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యాన వైదిక బృందం ఇంద్రగంటి రామారావుశర్మ, జుత్తుక చిన్నా, తుట్టకుంట సతీష్, సామంచి రాజేశ్వరశాస్త్రి బ్రహ్మత్వంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు నున్న సత్యవతి తదితరులు సోమవారం శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ కూలీలు 71 మందితో సప్త గోదావరిలో మట్టి తొలగించే పనులు చేపట్టారు. ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా నిధులు మంజూరు చేస్తోందని, దీనిలో భాగంగానే ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో విశాలమైన హోమశాల ఏర్పాటు చేశామని మంత్రి వేణు చెప్పారు. అన్నప్రసాద భవనం నిర్మాణం, సప్త గోదావరి ఆధునీకరణతో పాటు భక్తుల సౌకర్యార్థం టాయిలెట్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మృత్యు రాదారులు

- నిత్యం ప్రమాదాలు
- మితిమీరిన వేగం
- అదుపు లేని డ్రైవింగ్
- తోడవుతున్న మద్యం
- వీటన్నింటి ఫలితంగా గాల్లో కలుస్తున్న ప్రాణాలు

స్పీడ్ బైక్‌లు, వేగ నియంత్రణ లేని కార్లు, లారీలు, బస్సులు.. రయ్ మంటూ దూసుకుపోయేంతగా పట్టపగ్గాలు లేని వేగం.. తోడవుతున్న మద్యం మత్తు.. కరువవుతున్న స్వీయ నియంత్రణ.. కొంతమంది పోలీసులు, రవాణా శాఖ అధికారుల ఉదాసీనత.. ఫలితంగా ఇటీవల కొన్నాళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రహదారులు నిత్యం రక్తసిక్తమవుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కోల్‌కతా – చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తుని నుంచి నల్లజర్ల వరకూ సాగుతోంది. దీనికి అనుసంధానంగా కత్తిపూడి – ఒంగోలు 216, దివాన్‌చెరువు – గుండుగొలను 216ఎ, రాజమహేంద్రవరం – విజయనగరం 416 తదితర జాతీయ రహదారులున్నాయి. వీటితో పాటు రాజానగరం – కాకినాడ పోర్టు ఏడీబీ రోడ్డు కూడా ఉంది. ఇవన్నీ దాదాపు నాలుగు/రెండు లేన్ల రోడ్లుగా ఉన్నాయి. ఇటీవల వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేశాయి.. చేస్తున్నాయి. ప్రయాణం హాయిగా, కుదుపులు లేకుండా సాగడానికి వీలుగా.. నునుపుగా, విశాలంగా నిర్మించిన ఈ రోడ్లపై మితిమీరిన వేగంతో దూసుకుపోతూ పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అదుపు లేని వేగం ప్రాణాలు బలి కోరుతుందని, ప్రమాదకరమని తెలిసినా కొంతమంది థ్రిల్ కోసం.. మరికొంతమంది మద్యం మత్తులో పడి రోడ్డు ప్రమాదాలకు గురై, ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో అత్యధికంగా 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం గమనార్హం. ఈ రోడ్లపై ఇటీవల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే ఉన్నాయి.

జిల్లాలో గడచిన ఆరు నెలల్లో జరిగిన ప్రమాదాలు

216 జాతీయ రహదారిపై..	
ప్రమాదాలు :	76
మరణాలు :	21
క్షతగాత్రులు :	69
216ఏ జాతీయ రహదారిపై..	
ప్రమాదాలు :	35
మరణాలు :	12
క్షతగాత్రులు :	33
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు : 690 మందిపై	642
ఈ–చలానాలు :	37,756
జరిమానాలు :	రూ.94.86 లక్షలు

ప్రమాదాల పరంపర

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలను కలిపే 216 జాతీయ రహదారి ఇటీవల తరచుగా రక్తమోడుతోంది. వాహనచోదకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ రహదారిపై తాళ్లరేవు వద్ద ఇటీవల ఆటోను, ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘోర ప్రమాదం ఎనిమిది మంది మహిళలను బలి తీసుకుంది. వారి పిల్లలు తల్లులకు దూరమయ్యారు. ఈ సంఘటన జరిగి పట్టుమని 10 రోజులు కూడా కాకుండానే ఆదివారం అర్ధరాత్రి దాటాక అదే రోడ్డుపై ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు వద్ద జరిగిన మరో ప్రమాదంలో ముగ్గురు సమీప బంధువులు దుర్మరణం పాలయ్యారు. యానాం నుంచి అమలాపురం కారులో వెళ్తున్న వారిని ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ రెండు సంఘటనల్లోనూ మితిమీరిన వేగం, మద్యం మత్తులో వేగాన్ని నియంత్రించ లేకపోవడమే ప్రధాన కారణమని పోలీసు ఉన్నతాధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దుర్ఘటనలకు రెండు నెలల ముందు యానాం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం వెళ్తున్న కారు కూడా ఇదే జాతీయ రహదారిపై కొమానపల్లి వద్ద పల్టీలు కొట్టింది. ఒక విద్యార్థిని మృతి చెందగా ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. అంతకుముందు మరో ఘటనలో గృహప్రవేశానికి పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్న భార్యాభర్తలు చిన్నారులతో సహా మృత్యువాత పడ్డారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తాళ్లరేవు ఆటో ప్రమాదం తర్వాత అధికార యంత్రాంగం కళ్లు తెరిచింది. పలు ప్రాంతాల్లో వేగ నిరోధక చర్యలకు ఉపక్రమించింది. సీతారామపురం సుబ్బారాయుడు దిమ్మ, సీతారామపురం పెట్రోలు బంకు (గాడిమొగ జంక్షన్), తాళ్లరేవు కేశవస్వామి బైపాస్ జంక్షన్, గురజనాపల్లి జంక్షన్లలో వేగ నియంత్రణకు టైర్లు, డ్రమ్ములతో డివైడర్లు ఏర్పాటు చేశారు.



గత వారం తాళ్లరేవు వద్ద జరిగిన ఆటో ప్రమాదం



యానాం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని బార్ అండ్ రెస్టారెంట్లు

యానాం మద్యం కోసం..

216 జాతీయ రహదారికి ఇరువైపులా పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో పెద్ద సంఖ్యలో మద్యం దుకాణాలున్నాయి. అక్కడ సరసమైన ధరలకు మద్యం అందుబాటులో ఉంటోంది. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మద్యపాన ప్రియులు ఇక్కడ మద్యం తాగి, అదే మత్తులో వాహనాలు నడుపుతూ, ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని మద్యం దుకాణాలు ఉండరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. వీటిని మద్యం వ్యాపారులు బేఖాతరు చేస్తూ ప్రమాదాలకు పరోక్షంగా కారణమవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు కూడా దీనిని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రమాదాలకు మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడపడానికి తోడు జాతీయ రహదారికి సమాంతరంగా సర్వీసు రోడ్లు ఉన్న ప్రాంతాల్లో సరైన సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవం మరో కారణం.



కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలో 216 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

బ్లాక్‌స్పాట్లు

- 16వ నంబర్ జాతీయ రహదారిపై తూర్పు గోదావరి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రమాదకర కేంద్రాలు (బ్లాక్‌స్పాట్లు) ఉన్నాయి. పొట్టిలంక సెంటర్, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి, ఇండస్ట్రియల్ కాలనీ, హార్లిక్స్ ఫ్యాక్టరీ, మోరంపూడి జంక్షన్, లాలాచెరువు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కలవచర్ల జంక్షన్, గామన్ బ్రిడ్జి, ఖండవల్లి సెంటర్, అన్నవరప్పాడు సెంటర్, గోపాలపురం చెక్‌పోస్టు, కొవ్వూరు, నల్లజర్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి వీటిల్లో ఉన్నాయి.
- 216 జాతీయ రహదారిపై కాకినాడ జిల్లా తాళ్లరేవు, కోరంగితో పాటు, యానాం – ఎదుర్లంక వంతెన, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొమరగిరి డేంజర్ టర్నింగ్, కొమానాపల్లి, బొండాయికోడు – మహిపాల చెరువు, భట్నవిల్లి బ్లాక్‌స్పాట్లుగా ఉన్నాయి.

ప్రమాదం జరిగితేనే హడావుడి

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినప్పుడు పోలీసు, రవాణా శాఖలు ఒకటి, రెండు రోజులు హడావుడి చేస్తున్నాయి. ప్రజలు కూడా ఆ రెండు రోజులే కాస్త నెమ్మదిస్తున్నారు. తరువాత షరా మామూలే. అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. అలాగే, మితిమీరిన వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేయలేదు. మరోపక్క ఫిట్‌నెస్ లేని ఆటోలను, ద్విచక్ర వాహనాలను నియంత్రించడంలో పోలీసులు ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బ్లాక్‌స్పాట్లలో పటిష్ట చర్యలు



జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలపై హైవే అథారిటీ అధికారులతో మరోసారి చర్చిస్తున్నాం. బ్లాక్‌స్పాట్లలో బారికేడ్లు ఏర్పాటు చేస్తాం. స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల ద్వారా యువతకు మరింత అవగాహన కల్పిస్తాం. జాతీయ రహదారులపై రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచుతాం.

– సుసరాపు శ్రీధర్, జిల్లా ఎస్పీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వచ్చే ఎన్నికల్లో టీడీపీ సమాధే

- బీసీల ద్రోహి చంద్రబాబే
- మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పార్టీని వచ్చే ఎన్నికల్లో సమాధి చేసేందుకు బీసీలు, ఎస్సీలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 34 నుంచి 24 శాతానికి పడిపోవడానికి ప్రధాన కారకుడు చంద్రబాబే అని విమర్శించారు. దీనిపై ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ద్వారా కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చి, బీసీలకు ఆనాడు చంద్రబాబు ద్రోహం చేశారని మంత్రి ధ్వజమెత్తారు. అభివృద్ధి చూసి ఓర్వలేకే బందరు పోర్టుకు అడ్డంకులు కల్పించారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న మంచిని అడ్డుకోవడమే పనిగా చంద్రబాబు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఆయన బీసీల ఆత్మగౌరవం గురించి ఎప్పుడూ ఆలోచించలేదన్నారు. నాయీ బ్రాహ్మణులను నేడు ఆలయాలకు ట్రస్టు బోర్డు సభ్యులుగా వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని గుర్తు చేశారు.

50 శాతం రిజర్వేషన్ల ఘనత మాదే..

స్థానిక సంస్థలే కాకుండా నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కల్పించిందని, సామాజిక న్యాయం అనే పదానికి నిజమైన అర్థం చెప్పిందని మంత్రి వేణు వివరించారు. నాలుగేళ్ల సీఎం జగన్ ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా బీసీలు రూ.2.10 లక్షల కోట్ల లబ్ధి పొందారని తెలుసుకోవాలన్నారు. అధికారమే పరమావధిగా టీడీపీ నేతలు ప్రతి రోజూ ఒక వేషం వేసి తమ మీడియా ద్వారా అబద్ధాలు వల్లిస్తున్నారన్నారు. ఈ విషయాలను ప్రజలు గమనిస్తున్నారనే విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు, రాజ్యసభలో ప్రాధాన్యం, శాసనసభలో స్పీకర్ పదవిని వైఎస్సార్ సీపీ కల్పించిందని, ఇది టీడీపీ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు ఏ పాలనలో అమలు జరిగాయో ‘ఈనాడు’ పత్రికకు కానరావటం లేదని అన్నారు. పేదలకు అండగా నిలిచిన యుగపురుషుడు ఎన్‌టీ రామారావుకు వెన్నుపోటు పొడిచింది నువ్వు కాదా అని చంద్రబాబును ప్రశ్నించారు. నందమూరి కుటుంబాన్ని విభజించి తన పదవి కోసం వాడుకున్న చంద్రబాబు బీసీల గురించి మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి దుయ్యబట్టారు. ఒంటరిగా పోటీ చేయలేక పవన్ కల్యాణ్‌తో రేటు మాట్లాడుకుని, మోసగాడు, వేషగాడు కలసి ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. ఎంత మంది కలిసి వచ్చినా జనం కోసం ఒంటరిగానే పోరాటానికి జగన్ వస్తారని, ప్రజల పక్షాన నిలుస్తూ 175 సీట్లను 2024లో గెలుచుకోబోతున్నారని మంత్రి వేణు చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి వేణు

అక్విడెక్టుకు రూ.3 లక్షల మంజూరు

సాక్షి, అమలాపురం: రాయవరం మండలం మాచవరంలో చెల్లూరు నంబర్–1 కాలువపై అక్విడెక్ట్ పునర్నిర్మాణానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా నిధులు మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి సోమవారం ఈ విషయం తెలిపారు. ఈ అక్విడెక్ట్‌కు నిధులు మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇటీవల కలెక్టర్‌కు లేఖ రాశారన్నారు. అలాగే, ఈ సమస్యపై కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి, సీఎస్ఆర్ నిధులు రూ.3 లక్షలు ఇచ్చేందుకు హామీ ఇచ్చారని వివరించారు. ఈ అక్విడెక్ట్ అధ్వానంగా ఉండి శిథిలావస్థకు చేరడంతో కాలువ నీరు దిగువకు పోతోందని, దీనిని పునర్నిర్మిస్తే సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్, రబీలో సమృద్ధిగా సాగునీరందుతుందని త్రినాథ్‌రెడ్డి తెలిపారు. ఆయనతోపాటు రైతులు సత్తి వెంకటరెడ్డి, మల్లిడి రామారెడ్డి, పడాల వసంతకుమార్‌రెడ్డి, ఇరిగేషన్ జేఈ జేఎల్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స సకాలంలో అందించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ దుర్గారావుదొర

అమలాపురం టౌన్: రోగులు, క్షతగాత్రులకు సకాలంలో ప్రథమ చికిత్స అందించడంపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) అవగాహనతో ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) ఎం.దుర్గారావుదొర అన్నారు. జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు శిక్షణ తరగతులను అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆయన సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని 432 మంది ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు బ్యాచ్‌కు 40 మంది చొప్పున 11 బ్యాచ్‌లుగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రథమ చికిత్స, పాము కాటు బాధితులకు వైద్యం అందించడం, గాయపడిన వారికి డ్రెస్సింగ్ చేసే విధానం తదితర బేసిక్ లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి తెలిపారు. శిక్షణ తరగతుల స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ కిషోర్ కుమార్ శిక్షణలో తీసుకోవాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీహెచ్ భారతలక్ష్మి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. వైద్య శాఖలోని వివిధ కేటగిరీల్లో మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన 17 మంది ఈ శిక్షణ ఇవ్వనున్నారు.

డ్రెయిన్స్ ఈఈని బదిలీ చేయాలి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: డ్రెయిన్స్ శాఖ ఈఈ సుబ్బయ్యను తక్షణమే బదిలీ చేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో సాగుకు అనుసంధానంగా, రైతులకు ప్రయోజనకరంగా డ్రెయిన్లు అధికంగా ఉన్నాయని, ఈ క్రమంలో ఈ ప్రాంతానికి డ్రెయిన్స్ ఈఈ కార్యాలయాన్ని కాకినాడ నుంచి తరలించడానికి ఆటంకం కలిగేలా ఆయన తప్పుడు నివేదిక ఇచ్చారని మండిపడ్డారు. కోనసీమకు డ్రెయిన్స్ ఈఈ కార్యాలయం అవసరం లేదంటూ సుబ్బయ్య నివేదిక ఇవ్వడం క్షమించరాని నేరమని ధ్వజమెత్తారు. ఆయన వైఖరితో 75 ఏళ్లుగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ కుప్పకూలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కోనసీమకు డ్రెయిన్స్ ఈఈ కార్యాలయాన్ని తరలించేందుకు ప్రభుత్వం, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రైతులు సుముఖంగా ఉన్నా ఈఈ సుబ్బయ్య మాత్రం ఆ కార్యాలయం తరలింపును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనివలన కోనసీమ రైతులు అపారంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఈ సుబ్బయ్యను సెలవు మీద పంపించాలని లేకుంటే తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈఈ సుబ్బయ్య వైఖరిపై శాసన మండలి సమావేశాల్లో చర్చించి, చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు హెచ్చరించారు.

అడ్డంకులు తొలగినట్టే..

- కోనసీమకు గోదావరి డెల్టా డ్రెయిన్స్ ఈఈ కార్యాలయం
- కాకినాడ నుంచి తరలించాలని సీఎం జగన్ ఆదేశం
- మధ్యలో మోకాలడ్డిన అధికారి
- మండిపడిన రైతులు, వారి ప్రతినిధులు
- త్వరలో మార్చేందుకు కలెక్టర్ సానుకూలత

సాక్షి, అమలాపురం: ‘దేవుడు వరమిచ్చినా..’ అన్నట్టుగా తయారైంది గోదావరి డెల్టా డ్రెయిన్స్ శాఖ ఈఈ కార్యాలయం తరలింపు. కాకినాడలో ఉన్న ఈ కార్యాలయాన్ని కోనసీమకు తరలించాల్సిందిగా స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా.. సంబంధిత అధికారులు అందుకు మోకాలడ్డటం వివాదం రేపింది. రైతుసంఘాల నాయకులు, స్పందనలో రైతుల ఫిర్యాదుతో ఈ కార్యాలయాన్ని జిల్లాకు తరలించడంపై కలెక్టర్ హిమాన్షు శుక్లా సానుకూలంగా స్పందించారు.

పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిన్న జిల్లాలు ఏర్పాటు చేసింది. గ్రామీణ స్థాయిలో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసి పరిపాలను ప్రజల ముంగిటకు తీసుకు వచ్చింది. పలు కీలక ప్రభుత్వ శాఖల కార్యాలయాలను వాటి అవసరాలు అధికంగా ఉన్న ప్రాంతాలకు తరలిస్తోంది. డెల్టాలో మూడు వంతుల డ్రైనేజీ వ్యవస్థ మన జిల్లాలోనే ఉంది. ఇక్కడ కొన్ని ప్రాంతాల్లో ముంపు సమస్య కారణంగా రైతులు తొలి పంట వదిలేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ జిల్లాలో డ్రెయిన్స్ ఈఈ కార్యాలయం ఏర్పాటు తప్పనిసరి. ప్రస్తుతం కాకినాడలో ఉన్న ఈ కార్యాలయాన్ని మన జిల్లాకు మార్చాల్సిందిగా కలెక్టర్ హిమాన్షు శుక్లా గత ఏడాది వాటర్ రిసోర్సెస్ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపించారు. దీని ఆధారంగా ఎంపీ చింతా అనూరాధ, ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ) ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. గతంలో ఇక్కడ జరిగిన సాగు సమ్మె, ముంపు సమస్యపై అవగాహన ఉన్న సీఎం జగన్.. ఈఈ కార్యాలయాన్ని కోనసీమకు మార్చాలని ఆదేశించారు. దీనిపై రైతులు సంతోషంగా ఉన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలో ఈఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై తుది నివేదిక కోరగా, ఈ కార్యాలయాన్ని కాకినాడ నుంచి మార్చాల్సిన అవసరం లేదని డ్రెయిన్స్ ఈఈ సుబ్బయ్య కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ఇది బయటకు రావడంతో రైతు సంఘాల నాయకులు, రైతులు భగ్గుమన్నారు. కార్యాలయం తరలింపు అక్కడ పని చేసే ఉద్యోగులకు, సిబ్బందికి ఇష్టం లేదని, వారి ఒత్తిడితోనే అందుకు అనుగుణంగా డ్రెయిన్స్ ఈఈ సుబ్బయ్య ఈ నివేదిక పంపారని రైతుల ఆరోపించారు. 2019లో ధవళేశ్వరం నుంచి రెగ్యులర్ ఈఈ కార్యాలయం మార్పు సమయంలో కూడా ఉద్యోగులు, సిబ్బంది ఇలా అవాంతరాలు సృష్టించి, ఏడాది పాటు అడ్డుకున్నారు.



కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతు నేతలు

స్పందనలో ఫిర్యాదు

డ్రెయిన్స్ అధికారుల నిర్వాకంపై ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధ స్థానం పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈఈ సుబ్బయ్య వద్ద తమ అసంతృప్తిని వారు బహిరంగంగానే వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ శుక్లా.. ఈఈ కార్యాలయం జిల్లాకు వచ్చేలా వాస్తవ నివేదికను మరోసారి పంపుతానంటూ హామీ ఇచ్చారని, కార్యాలయం ఏర్పాటుకు అవాంతరాలు తొలగినట్టేనని రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు.

కోనసీమలోనే కీలకం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ ఉంది. ఈఈ కార్యాలయం పరిధిలో కాకినాడ, రామచంద్రపురం, అమలాపురం, రాజోలు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో మూడు సబ్ డివిజన్లు అమలాపురం, రాజోలు, రామచంద్రపురం కోనసీమ జిల్లాలో ఉన్నాయి. కోనసీమ జిల్లాలో 232 డ్రైనేజీలు 1,022 కిలోమీటర్ల పొడవున ఉన్నాయి. కాకినాడలో జిల్లాలో 80 డ్రెయిన్లు 380 కిలోమీటర్ల మేర, తూర్పు గోదావరి జిల్లాలో 13 డ్రెయిన్లు 63 కిలోమీటర్ల మేర ఉన్నాయి. ముంపు సమస్య కూడా కోనసీమ జిల్లాలోనే ఉంది. పలువురు రైతులు తొలి పంట సాగు చేయడం లేదు. ఇన్ని సమస్యల పరిష్కారానికి ఈఈ కార్యాలయాన్ని జిల్లాకు తరలించడం తప్పనిసరి. సీఎం జగన్ ఆదేశించిన తరువాత కూడా అధికారులు అడ్డంకులు సృష్టించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ కార్యాలయాన్ని ఇక్కడకు తీసుకు వచ్చేందుకు కలెక్టర్ శుక్లా తొలి నుంచీ పట్టుదలతో ఉండటం, అనుకూల నివేదిక పంపుతానని హామీ ఇవ్వడంతో జిల్లాలో ఈఈ కార్యాలయం ఏర్పాటుపై రైతులకు భరోసా దక్కింది.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి వెండి కవచం


వెండి కవచాలంకరణలో స్వామివారు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జగన్నాథపురంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారికి నగరానికి చెందిన భక్తుడు గోవిందరావు రూ.30 లక్షలతో తయారు చేయించిన వెండి వజ్ర కవచం సమర్పించారు. దీనికి అర్చకులు సోమవారం సంప్రోక్షణ చేసి, స్వామి వారికి అలంకరించారు. దాతను ఆలయ ఈఓ తారకేశ్వరరావు సత్కరించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

తుని: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందింది. ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. అన్నవరం రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి ఆ వృద్ధురాలు పట్టాలు దాటుతోంది. అదే సమయంలో తుని నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె వద్ద ఎటువంటి ఆధారాలూ లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 94906 19020, 94948 87786 నంబర్లలో సంప్రదించాలనిని ఎస్సై మారూఫ్ తెలిపారు.

వృద్ధుడిపై హత్యాయత్నం

పెద్దాపురం: పాత కక్షల నేపథ్యంలో ఓ వృద్ధుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు ఓ దుండగుడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన విజ్జపురెడ్డి విష్ణుకు, అతడి తమ్ముడు పెద్దలుకు మధ్య కొన్నాళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. తన తమ్ముడికి గ్రామానికి చెందిన గవరసాని వెంకట్రావు (65) మద్దతుగా ఉంటున్నాడని అతడిపై విష్ణు కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో చదలాడ రోడ్డులోని పొలంలో ఉన్న మొక్కలకు వెంకట్రావు సోమవారం నీరు పోస్తున్నాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. ఇదే అదునుగా అతడిపై విష్ణు ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, రెండు భుజాలూ నరికాడు. గాయపడిన వెంకట్రావును స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సరదాల వేళ.. మృత్యు పరదా

- ప్రాణాలు కబళించిన పెళ్లి రోజు పార్టీ
- యానాం వెళ్లి వస్తుండగా 'ఎదురొచ్చిన' మృత్యువు
- ముమ్మిడివరం ప్రమాద మృతులు ముగ్గురూ బంధువులే
- అందరిదీ రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబాలే
- తీరని విషాదంలో బాధిత కుటుంబాలు




దొంగ నాగ వెంకటస్వామి, గంజా కృష్ణ, యనమదల సురేష్ కుమార్ మృతదేహాలు


అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లు అని

అమలాపురం టౌన్: ఆ ముగ్గురూ బంధువులే.. వారితో పాటు ఓ స్నేహితుడు.. అందరిదీ రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబాలే.. వీరిలో ఒకరి పెళ్లి రోజు కావడంతో అందరూ కలిసి కారులో యానాం వెళ్లారు. సరదాగా పార్టీ చేసుకున్నారు. ఆనందంగా గడిపారు. తిరిగి అర్ధరాత్రి స్వస్థలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో వారికి టిప్పర్ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. ముగ్గురి ప్రాణాలను తీసుకువెళ్లిపోయింది. మరొకరిని క్షతగాత్రుడిగా మిగిల్చి, ఆసుపత్రి పాలు చేసింది.

ముమ్మిడివరం సమీపంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురూ అమలాపురం పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన వారే. వీరిలో దొంగ నాగ వెంకటస్వామి (30), గంజా కృష్ణ (38) స్వయంగా బావా బావమరుదులు. మరో మృతుడు యనమదల రమేష్ కుమార్ (33) కూడా వీరికి దగ్గరి బంధువే. వీరిలో వెంకటస్వామి ఆర్క్ వెల్డర్‌గా పని చేస్తూ అమలాపురం నారాయణపేటలోను, కృష్ణ తాపీ మేస్త్రిగా స్థానిక హైస్కూలు సెంటరు సమీపంలోను నివసిస్తున్నారు. రమేష్ కుమార్ ఆటో డ్రైవర్. అతడి కుటుంబం అమలాపురం రూరల్ మండలం రంగాపురంలో జీవిస్తోంది.

పెళ్లి రోజున అమ్మవారి ఆలయానికి వెళ్లి..

వెంకటస్వామి, గీతాలక్ష్మి దంపతులు తమ పెళ్లి రోజును ఆదివారం ఉదయం ఇంటి వద్ద వేడుకగా నిర్వహించుకున్నారు. అనంతరం తమ ఐదేళ్లలోపు పిల్లలు శరణ్య, సుశాంత్‌తో కలిసి కొత్తపేట మండలం వానపల్లి పళ్లాలమ్మ ఆలయానికి వెళ్లారు.


మృతుడు నాగ వెంకటస్వామి ఇంటి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిరకాలం ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని అమ్మవారిని మనసారా వేడుకున్నారు.

పార్టీకి యానాం వెళ్లి వస్తూ..

అయితే విధి నిర్ణయం వేరేలా ఉన్నట్టుంది. పెళ్లి రోజు పార్టీ చేసుకునేందుకని వెంకటస్వామి కారులో అతడు, బావ కృష్ణ, వారి బంధువు రమేష్ కుమార్, స్నేహితుడు అల్లు అనిల్ కలిసి సాయంత్రం యానాం వెళ్లారు. అక్కడ ఆనందంగా పార్టీ చేసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి యానాం నుంచి అమలాపురం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారును శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటస్వామి, కృష్ణ, రమేష్‌కుమార్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అనిల్ ఆందోళనకర పరిస్థితుల్లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


అమలాపురంలో తాపీమేస్త్రి కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సహాయక చర్యల్లో జక్కంపూడి కిరణ్

ఈ ప్రమాదం జరిగిన కొద్ది క్షణాల తర్వాత అదే రోడ్డులో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ కాకినాడ నుంచి కారులో అమలాపురం వస్తున్నారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే ఆయన స్పందించారు. చావు బతుకుల మధ్య కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకులను వెంటనే కారులో నుంచి బయటకు తీసి, కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కిరణ్ నుదిటిపై స్వల్ప గాయం కూడా అయ్యింది. అయినప్పటికీ ఆయన 108కు సమాచారం అందించి, ప్రమాదానికి గురైన వారిని ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ముగ్గురి మృతదేహాలూ అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోవడంతో.. వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడ విషాదం అలముకుంది.

రెక్కలు తెగిన కుటుంబాలు

తమ పెళ్లి రోజునే జరిగిన ఈ ప్రమాదంలో భర్త వెంకటస్వామి దుర్మరణం పాలవడంతో అతడి భార్య గీతాలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు బంధువులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. మరో మృతుడు గంజా కృష్ణకు భార్య సూర్యాదేవి, పిల్లలు 13 ఏళ్ల రవిచంద్ర, 11 ఏళ్ల విక్రమ్ ఉన్నారు. రమేష్ కుమార్‌కు భార్య సుజాత, పిల్లలు 14 ఏళ్ల చరణ్‌కుమార్, ఎనిమిదేళ్ల సత్య కార్తికేయ ఉన్నారు. మృతి చెందిన ముగ్గురూ దాదాపు యువకులే. వారి సంతానం కూడా ఇంకా చిన్న పిల్లలే. తమ బతుకులకు ఆధారంగా ఉన్న ఇంటి యజమానులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు ఒక్కసారిగా రెక్కలు తెగిన పక్షుల్లా దిక్కు లేనివిగా మారాయి.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్టు


చోరీల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్

బిక్కవోలు: రాత్రి వేళల్లో ఇళ్లలోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళల వద్ద బంగారు ఆభరణాలు దోచుకుంటున్న అంతర్రాష్ట్ర దోపిడీ దొంగను అరెస్టు చేసినట్టు రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు. బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం పెంట శ్రీరామపురం గ్రామానికి చెందిన గంధవరపు గోపి పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన సేనాపతి సత్యవతి ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తోంది. ఆమె ఇంట్లోకి చొరబడిన గోపి ఆమెను గాయపరచి 3 కాసుల బంగారు తాడు దోచుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనపర్తి సీఐ వి.శ్రీనివాస్, బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు దీనిపై దర్యాప్తు చేశారు. గోపి ఈ దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించి, ఆదివారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేరంతో పాటు పది రోజుల క్రితం అనపర్తి మండలం రామవరంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు కూడా దోచుకున్నట్టు గోపి చెప్పాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి 3 కాసుల బంగారు తాడు, 12 గ్రాముల గొలుసు స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలించారు. దొంగను చాకచక్యంగా పట్టుకోవడానికి కృషి చేసిన డీఎస్పీ కిషోర్ కుమార్ సారథ్యంలోని సీఐ శ్రీనివాస్, ఎస్సై బుజ్జిబాబు, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, వీరబాబులను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

చోరీ కేసులలో ఇద్దరి అరెస్టు

మామిడికుదురు: రెండు చోరీ కేసులలో కరవాక గ్రామానికి చెందిన కేతాడి సతీష్, అవనిగడ్డ జయంత్‌వర్మలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నిందితులను సోమవారం రాజోలు కోర్టులో హాజరుపరిచామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. మామిడికుదురులోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి వస్తువులతో ముద్దాయిలు

తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కరవాక గ్రామంలో 2020లో జరిగిన చోరీతో పాటు ఇటీవల జరిగిన దొంగతనం కేసులపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన నిందితుల వేలిముద్రలు సేకరించి, పరిశీలనకు పంపగా.. వారు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితుల నుంచి రూ.5.43 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.1.58 లక్షల నగదు, 60 గ్రాముల బంగారం, 105 గ్రాముల వెండి వస్తువులు ఉన్నాయి. నిందితులను అరెస్టు చేసిన పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్, నగరం ఎస్సై షేక్ జానీబాషా, క్రైం పార్టీ హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ డి.చిరంజీవికృష్ణతో పాటు నగరం కానిస్టేబుళ్లను కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, సీఐ ప్రశాంత్‌కుమార్ అభినందించారు.

'మా భర్తలను సొంత జిల్లాలకు బదిలీ చేయండి'

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్లలో పని చేస్తున్న తమ భర్తలను జీఓ నంబర్–71 ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ పలువురు పోలీసు సిబ్బంది భార్యలు, కుటుంబ సభ్యులు కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. 2022లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తమ భర్తలు (పోలీసులు) పని చేసేవారన్నారు. వారిని జిల్లాల పునర్విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్లకు బదిలీ చేశారని తెలిపారు. తిరిగి వారిని కాకినాడ జిల్లాకు బదిలీ చేయాల్సిందిగా కోరామని, ఇప్పటికీ ఏజెన్సీలోనే పని చేయిస్తున్నారని చెప్పారు. దీనివలన తాము ఒకచోట, తమ భర్తలు మరోచోట ఉండాల్సి వసోతందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే పరిస్థితి లేక తమ భర్తలు వేదనకు గురవుతున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండేళ్ల నుంచి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని సొంత జిల్లా అయిన కాకినాడ లేదా మైదాన ప్రాంతానికి బదిలీ చేయాల్సిందిగా కలెక్టర్‌కు, ఎంపీ వంగా గీతకు విజ్ఞప్తి చేశామన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన వారిలో 60 మందికి పైగా మహిళలున్నారు.


తమ భర్తలకు ఏజెన్సీ నుంచి బదిలీ చేయాలని కోరుతున్న పోలీసు సిబ్బంది భార్యలు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 38 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. తూర్పు గోదావరిలో 31, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 7 చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు మార్క్‌ఫెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేంద్రాల్లో క్వింటాల్ మొక్కజొన్నను రూ.1,962 చొప్పున కొనుగోలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి లంక భూముల్లో మొక్కజొన్న సాగు చేస్తారు. కోనసీమలో అయినవిల్లి, ముమ్మిడివరం, పి.గన్నవరం, మామిడికుదురు, ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలు; తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరం, కొవ్వూరు లంకలతో పాటు మెట్ట ప్రాంతంలో రెండో పంటగా మొక్కజొన్న సాగు జరుగుతోంది. ఆయా ప్రాంతాల రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు


కొవ్వూరులో బహిరంగ సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

- పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కొవ్వూరులో జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె సోమవారం రాత్రి పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి 2.1 కిలోమీటర్ల పొడవునా సభా ప్రాంగణం వరకూ నిర్వహించే సీఎం రోడ్‌షోకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రూట్ మ్యాప్‌లో భద్రతా చర్యలపై ఎస్పీతో చర్చించారు. అనంతరం సభా ప్రాంగణంలో గ్యాలరీలను పరిశీలించారు. సభా ప్రాంగణంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతితో పాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, చైత్రవర్షిణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఈఎస్‌బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ట్రాఫిక్ మళ్లింపు

- సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కొవ్వూరు పట్టణంలో ట్రాఫిక్ మళ్లించనున్నట్టు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు.
- పట్టణంలోకి లారీలు, ఇతర సరకు వాహనాలకు అనుమతి లేదు.
- ఏలూరు, హైదరాబాద్ వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే వాహనాలను, ఆర్టీసీ బస్సులను గామన్ ఇండియా బ్రిడ్జి మీదుగా మళ్లిస్తారు.
- రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు రోడ్డు–కం–రైలు వంతెన, కొవ్వూరు వాటర్ ట్యాంకు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- బస్సులతో సహా ఏ వాహనాన్నీ పట్టణంలోకి అనుమతించరు.
- కొవ్వూరు వచ్చే బస్సు ప్రయాణికులను ఏసీఆర్ లాడ్జి జంక్షన్ దాటాక పెట్రోలు బంక్ వద్ద దింపాలి.
- నిడదవోలు, తాడేపల్లిగూడెం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సులను గామన్ బ్రిడ్జి మీదుగా నడపాలి.
- రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు, తాడేపల్లిగూడెం వెళ్లే వాహనాలను ధవళేశ్వరం ఆనకట్ట మీదుగా మళ్లించనున్నారు.
- ఉదయం 11 నుంచి రోడ్డు కం రైలు వంతెన మీద, ధవళేశ్వరం ఆనకట్ట మీద వన్‌వే ట్రాఫిక్ అమలు చేస్తారు.